విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

బుధవారం 25 డిసెంబరు 2024 8 పేజీలు

వందేళ్ల సీపీఐకి వందనం

'2024 డిసెంబరు 26 నాటికి భారత కమ్యూనిస్టు పార్టీ 99 ఏళ్లు పూర్తి చేసుకుని శత వసంతంలోకి అడుగిడనున్నది. 1925 డిసెంబరు 26న స్థాపించిన నాటి నుంచి భారత స్వాతంత్ర్య సాధన ఉద్యమంలో చురుకైన పాత్ర వహించింది. బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని అడుగడుగునా ఎదిరించి పోరాడింది. అశేష త్యాగాలు చేసింది. దేశంలో కార్మికులను, రైతులను, మేధావులను మేల్కొలిపి బ్రిటీష్ దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా సమర శంఖం పూరించింది.'

విశాలాంధ్రబ్యూరో - ఏలూరు: సోవియట్ యూనియన్ విప్లవ ప్రభావం నుండి మార్క్స్ సిద్ధాంతాల స్ఫూర్తితో భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ స్థాపన డిసెంబర్ 26, 1925న కాన్పూర్‌లో జరిగింది. నాటికి స్వాతంత్ర పోరాటంలో భారతీయులందరినీ నడిపిస్తున్న శక్తివంతమైన పార్టీ కాంగ్రెస్. కానీ కాంగ్రెస్‌కు ఆ రోజుకు ఆర్థిక విధానం మీద, సామాజిక విధానాల మీద స్పష్టత లేదు. ఆ పార్టీ ఏకైక లక్ష్యం స్వాతంత్ర్య సాధన.ఇది 1947లో సాధిం చింది. కాంగ్రెస్ ఒక రాజకీయ పార్టీ కాదు, అది దేశ సేవ కోసం అవతరించిన సంస్థగా కొందరు కాంగ్రెస్ పెద్దలు తెలిపేవారు.

నూతన ఒరవడికి శ్రీకారం

ఒక కొత్త ఆలోచనతో సమ సమాజ నిర్మాణ భావనతో, సోషలిజం అనే నినాదం, ఎర్రరంగు జెండా, కంకి - కొడవలి రైతాంగానికి ప్రతీకగా కమ్యూనిస్టు పార్టీ అవతరించింది. ఒక సమయంలో జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం కమ్యూనిస్టులే అని అనిపించుకున్నారు. తొలితరం నాయకులు విద్యావంతులు, దేశ సమస్యల పట్ల అవగాహన కలిగిన వారు,పేదరికం నిర్మూలించేందుకు తమదైన పరిష్కార మార్గాలు కలిగి ఉన్నవారు, కుల,మత,భాష, ప్రాంతాలన్నింటికీ అతీతంగా మానవత్వానికి పెద్ద పీట వేస్తూ, మనుషులంతా ఒకటేనన్న భావనతో పార్టీ నడుస్తుందని నాడు స్పష్టం చేశారు. ఈ వినూత్న భావనకు దేశంలోని కవుల గొంతులు,రచయితల కలాలు,యువకుల నినాదాలు జత చేరడంతో సోవియట్ యూనియన్ తర్వాత ఎర్ర జెండా ఎగిరేది భారత్‌లోనే అనే విశ్వాసం కలిగించారు.

త్యాగాలు నిరుపమానం

భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో తొలి తరం నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు, సురవరం, రావి నారాయణరెడ్డి వంటి నాయకుల పేర్లు ప్రజలలో ఇప్పటికీ గుర్తుండిపోయాయి. భూస్వామ్య వర్గాల నుంచి వచ్చిన ఆ నాయకులంతా తమ కుటుంబ ఆస్తులను పార్టీ కోసం, ప్రజల కోసం త్యాగం చేసిన వారు. సిద్ధాంత నిబద్ధతతో పని చేసినవారు. స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొన్న రాజకీయ పార్టీగా సీపీఐ ▶మిగతా 4లో..

కరుణ, త్యాగానికి ప్రతీక క్రిస్మస్

క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్లు

విశాలాంధ్ర-ఏలూరు/ భీమవరం : క్రిస్మస్ పండుగని పురస్కరించుకుని జిల్లాలోని క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బైబిల్ పేర్కొన్న ప్రేమ, క్షమాగుణం, దయాతత్వం, శాంతితత్వం ప్రతిఒక్కరూ కలిగివుండాలన్నారు. నిస్సహాయులపై కరుణ చూపాలని శతాబ్దాల క్రితమే క్రీస్తు ప్రబోధించారని వారు గుర్తుచేశారు. క్రైస్తవసోదర, సోదరీమణులందరూ క్రిస్మస్ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కలెక్టర్లు ఆకాంక్షించారు.

సీపీఐ శత వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -భీమవరం: సీపీఐ శత వార్షికోత్సవాల్లో భాగంగా ఈనెల 26 న భీమవరంలో జరుగునున్న ప్రదర్శన, బహిరంగ సభల్లో కార్మిక వర్గం, శ్రమజీవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపు నిచ్చారు. మంగళవారం బుధవారం మార్కెట్ వద్ద జరిగిన భీమవరం 1వ డివిజన్ మున్సిపల్ కార్మికుల సీపీఐ శాఖా సమావేశంలో భీమారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కిలారి మల్లేశ్వరరావు అధ్యక్షత వహించగా భీమారావు మాట్లాడుతూ శ్రమజీవుల హక్కుల సాధనే లక్ష్యంగా కార్మికుల శ్రమదోపిడీకి వ్యతిరే కంగా కనీస వేతనాలు 8 గంటల పని సాధన ఇంకా అనేక కార్మిక హక్కులు,చట్టాలు సాధనకు సీపీఐ నిర్విరామ పోరాటాలు సాగించిందన్నారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం,దారిద్ర్యం లేని ధనిక,పేద తారతమ్యాలు,కుల,మత వివక్ష తకు తావులేని సమసమాజ స్థాపనే లక్ష్యంగా సీపీఐ వందేళ్ళుగా విరామం మెరుగని పోరాటాలు సాగిస్తుందన్నారు. సీపీఐ ఆవిర్భావం జరిగి వందేళ్ళు అవుతున్న సందర్భంగా జరుగుతున్న సీపీఐ శత వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించాలని, వాడవాడలా సీపీఐ పతాకాలు ఆవిష్కరించి ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించి సీపీఐ వందేళ్ళ ఉద్యమ పోరాటాలు చరిత్ర వివరించాలని భీమారావు కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సముపార్జనలో ఎంతోమంది కమ్యూనిస్టులు జైళ్లకు వెళ్ళారని,ప్రాణ త్యాగాలు చేశారన్నారు.దేశంలో ప్రజాస్వామ్యం,లౌకిక రాజ్యాంగ పరిరక్షణకు,మతసామరస్య సాధనకు ఎనలేని కృషి నిర్వహిస్తుందన్నారు. సీపీఐ శత వార్షికోత్సవాలు సందర్భంగా ఈనెల 26న భీమవరంలో చేపట్టిన ప్రదర్శన,బహిరంగ సభలను విజయవంతం చేయాలని రంగారావు కోరారు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడు యేలేటి విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

ఘనంగా ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 72వ ఆవిర్భావ వేడుకలు

విశాలాంధ్ర - కాకినాడ : ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో అధ్యక్షులు కట్టిమేను మోహన్ రావు అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కార్మికుల సీనియర్ నేత, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కిర్ల కృష్ణారావు, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ముందుగా ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జండాను కిర్ల కృష్ణారావు ఆవిష్కరించారు. కృష్ణారావు ఈ సందర్భంగా మాట్లాడుతూ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంప్లాయిస్ సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయన్నారు. సమస్య వచ్చిన వెంటనే ▶మిగతా 2లో..

రైతుల సంక్షేమానికి పెద్దపీట

రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్

విశాలాంధ్ర - అమలాపురం : రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండల పరిధిలోని దుగ్గుదూరు, ఉప్పుమిల్లి గ్రామాల రైతులకు సాగునీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం మంత్రి సుభాష్ ఇరిగేషన్ శాఖ అధికారులు, రైతులతో కలిసి పలు పంట కాలువలు, డ్రెన్లను పరిశీలించారు. ప్రస్తుత రబీ సీజన్లో రైతులకు ఎలాంటి నీటి కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. దుగ్గుదూరు ఛానల్, కుయ్యేరు ఈస్ట్ సైడ్ ఉన్న మూడువేల ఎకరాల్లో సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీటి ▶మిగతా 2లో..

ధాన్యం కొనుగోళ్లు భేష్

ఇంతవరకు రూ. 642.82 కోట్ల విలువైన 2.79 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరుగుతుంది. రైతుల నుంచి చేపడుతున్న ధాన్యం కొనుగోళ్లు,బిల్లుల చెల్లింపులపై రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో రైతుల నుంచి ప్రభుత్వం ధాన్యం సేకరిస్తున్న విధానం బాగుందని పలువురు రైతులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. జిల్లాలో పలుమార్లు పర్యటించి ధాన్యం సేకరణ తీరును జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజరు వి.శ్రీలక్ష్మి

మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డిల ప్రత్యేక పర్యవేక్షణలో జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు సాఫీగా,సజావుగా జరుగుతుందన్నారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరుగుట కొరకు జిల్లా యంత్రాంగం క్షేత్ర స్థాయి పర్యవేక్షణ నిమిత్తం మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించారన్నారు.ప్రస్తుత ఖరీఫ్ లో రైతుల నుంచి 244 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇంతవరకు 35 వేల 706 మంది రైతుల నుంచి 2,79,534 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.రైతు కోరిన రైస్ మిల్లుకు తరలించేందుకు 82,64,849 గోనె సంచులను 2345 వాహనములను వినియోగించారు. గత ధాన్యం బకాయిలకు సంబంధించి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రైతులకు రూ.472 కోట్లు కూటమి ప్రభుత్వం చెల్లించింది.

క్రైస్తవ సోదరులకు కొలుసు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-నూజివీడు: క్రిస్మస్ పండుగ ప్రతీ ఒక్కరి ఇంటిలోనూ సంతోషాలు నింపాలని క్రిస్మస్ పండగ సందర్భంగా క్రైస్తవ సోదరులకు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శుభాకాంక్షలు తెలి పారు. ప్రేమ, త్యాగానికి ప్రతీకైన యేసు క్రీస్తు బోధనలు ప్రతీ ఒక్కరికీ అనుసరణీయమన్నారు. ప్రేమ, శాంతి, దయాగుణాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి 'యేసుక్రీస్తు' అని ప్రతీ ఒక్కరూ ప్రేమ, దయాగుణాన్ని కలిగి ఉండాలన్నారు. ప్రేమ, దయాగుణాన్ని ఇతరులకు పంచాలని క్రీస్తు ప్రజలకు బోధించడమే కాక, జీవించి చూపించారన్నారు. క్రైస్తవ సోదర, సోదరీమణులందరూ క్రిస్మస్ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య సంతోషంగా జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

వెయిటింగ్ హాలుకు మండల పరిషత్ తీర్మానం

విశాలాంధ్ర-ముదినేపల్లి: వెయిటింగ్ హాల్ కోసం మండల పరిషత్ తీర్మానం చేసినట్టు ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ స్పష్టం చేశారు. ఒక దినపత్రికలో

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తులకు ఏర్పాటు చేశారన్న కథనంపై ఎంపీపీ స్పందించగా, సమాచార హక్కు చట్టంపై ప్రతి పనికి ఒక రేటు అనే కథనాలపై ఎంపీడీవో వై.రామకృష్ణ స్పందించారు. వారు ఈ కథనాలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముదినేపల్లి వంటి పెద్ద మండలంలో మండల పరిషత్ కార్యాలయంలో వివిధ పనుల కోసం వచ్చే వారికి వెయిటింగ్ హాల్ ఆవశ్యకత ఎంతైనా ఉందని సభ్యుల వినతి చొప్పున గతంలో స్టోర్ రూముగా ఉన్న గదిని మరమ్మతులు చేసి వెయిటింగ్ హాల్ నిమిత్తం ఏర్పాటు చేశామన్నారు. దీనిపై ప్రైవేటు వ్యక్తులు ఎవరు లేరన్నారు. సమాచార హక్కు చట్టంపై నిబంధనల మేరకు వ్యవహరిస్తున్నామని ప్రతి పనికి ఒక రేటు ప్రాతిపదికగా వాడడం తప్ప ఇందులో వాస్తవం లేదని ఉంటే తమ దృష్టికి తెస్తే చర్యలు చేపడతామన్నారు సభ్యులకు కార్యాలయ సిబ్బందికి ఎటువంటి అసౌకర్యాలు లేవని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మండల పరిషత్ కార్యాలయ ఆధునికరణ పనులు ఎంపీపీ వివరించారు.

క్రిస్మస్‌పై తుపాను ప్రభావం

విశాలాంధ్ర-లింగపాలెం: క్రిస్మస్ పండుగకు తుఫాను ప్రభావంవల్ల క్రైస్తవులలో నిరాశ అలుముకుంది. లింగపాలెం మండలంలో మంగళవారం వర్షం పడుతూనే ఉంది. క్రిస్మస్ వేడుకలు నిర్వహించేందుకు ఉత్సాహంతో ఉన్న వారంతా నిరుత్సాహానికి గురయ్యారు. చర్చిలను అలంకరించే

పనులకు అంతరాయం వాటిల్లింది.క్రైస్తవులు క్రిస్మస్ పండుగ సందర్భంగా ఇళ్లను ముస్తాబు చేసుకుంటారు. ఈసారి ఈ పనులకు తీవ్ర ఆటంకం కలిగింది. చర్చిలన్నీ విశ్వాసులతో కిటకిటలాడతాయి. చర్చి ఆవరణలో పశువుల పాకలను నిర్మించి బాల యేసు రూపాలను ఉంచుతారు. వర్షం వల్ల వీటిని ఏర్పాటు చేయడానికి అంతరాయం కలిగింది. క్రిస్మస్ ను పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో విశ్వాసులు చర్చిలలో ప్రార్థనలకు వస్తారు. ఆలయాలలో లోపల భాగం సరిపోకపోవడంతో వీరి కోసం చర్చిబయిట షామియానా పందెళ్లు వేసి ఏర్పాట్లు చేస్తారు.ఈసారి ముసురు వల్ల వీటిని వేయటానికి వీలులేని పరిస్థితి ఏర్పడింది. వాతావరణ ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా ప్రార్థనలకు ఆటంకం లేకుండా క్రైస్తవ మత బోధకులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-లింగపాలెం: యడవల్లిలో గుండెపోటుతో మృతి చెందిన పరసా మోహన్ బాబు కుటుంబాన్ని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉదయ్ పరామర్శించారు. మృతి చెందిన వ్యక్తికి నివాళు లర్పించి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు.క్రిస్మస్ కానుకగా దుస్తులు కూడా బహుకరించారు.

క్రమబద్ధీకరించాలి

(1వ పేజీ తరువాయి)

అధికారుల దృష్టికి తీసుకెళ్లి తెలియజేసేందుకు యూనియన్ ఎంతో తోడ్పడుతుందని, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి, ప్రభుత్వ ఆసుపత్రిలో పరికరాల లోటును పూడ్చేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ కీలకపాత్ర వహిస్తుందని పేర్కొన్నారు. నిరంతరం ప్రజా శ్రేయస్సు కొరకు, నిస్వార్థం లేకుండా యూనియన్ కార్యకలాపాలు నిర్వహిస్తుందని 71 సంవత్సరాలు పాటు సుదీర్ఘంగా ప్రయాణం చేసి 72వ సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకుంటున్నామని ఆయన అన్నారు. ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బి. స్వామిబాబు మాట్లాడుతూ ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులు, వారిపై పని భారాలు మోపిన వెంటనే సూపరింటెండెంటును కలిసి యూనియన్ ఆధ్వర్యంలో ఆ ఇబ్బందులు తీర్చడంలో ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అనుబంధ సంఘం ముందు ఉంటుందన్నారు. డాక్టర్ల సమన్వయంతో సంప్రదింపులు చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలు నిమిత్తం వచ్చిన ప్రజలకు వైద్య సౌకర్యం పూర్తిస్థాయిలో అందేలా పనిచేస్తూ ఉంటామని ఆయన అన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ మెడికల్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ తక్షణమే క్రమబద్ధీకరించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే రాయితీలన్నీ అమలు చేయాలని ప్రసాదన్నారు. ఈ కార్యక్రమంలో డైటీషన్ సురేంద్ర, యూనియన్ వైస్ ప్రెసిడెంట్లు వై రాజబాబు, ఎస్ రాజబాబు, జాయింట్ సెక్రటరీలు వి. సత్యనారాయణ, ఎస్‌కె అలీషా, కె. పండు, బి. జోగారావు. ఆర్. నాని బాబు, ఎస్‌వివి సత్యనారాయణ, మంగతాయారు, ప్రసాద్, శ్రీరామ్ మూర్తి, వెంకట్, డి.శ్రీనివాస్, కాశీ విశ్వనాథ్ మోహన్, అనురాధ, సర్వారత్నం, దావీద్ కుమార్, రామయ్య, అనిల్ కుమార్, జిలాని, వినయ్, కృష్ణ, అజయ్ కుమార్, వైద్య ఉద్యోగులు పాల్గొన్నారు.

పెద్దపీట

(1వ పేజీ తరువాయి)

కొరత నేపథ్యంలో సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు మంత్రి సుభాష్ సూచించారు. అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. అన్నదాతలను ఆదుకునేందుకు, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తూ బడ్జెట్లో నిధులు కేటాయించామన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నలను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వ పరంగా ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రబీ సీజన్లో మినహా ఖరీఫ్ సీజన్లో సాగునీటికి ఎలాంటి కొరత లేదని మంత్రి సుభాష్‌కు ఇరిగేషన్ అధికారులు వివరించారు. మంత్రి సుభాష్ వెంట ఇరిగేషన్ ఈఈ వివి రామకృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యు. రమేష్ బాబు, ఏఈ విన్నకోటి సుజాత, కూటమి నాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

సజావుగా ధాన్యం కొనుగోళ్లు

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలో 10,500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లను లక్ష్యంగా పెట్టుకున్నామని దాదాపుగా పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తహసిల్దార్ నజీమ్, వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ

వెల్లడించారు. మండలంలో మంగళవారం వర్షం పడటంతో అత్యవసరంగా ఆరబెట్టి ఉంచిన దాదాపు 200 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. దీంతో 10,300 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని అధికారులు వివరించారు. ఈ ఏడాది విజయవంతంగా ధాన్యం కొనుగోలు జరిగిందని రైతులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఉన్నతాధికారుల సూచనలతో ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్ళామని తెలిపారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి మండలంలోని 1516 మంది రైతులకు దాదాపు రూ10 కోట్ల నగదు రైతుల ఖాతాలలో జమ అయ్యిందని తెలిపారు. ధాన్యం తరలింపులో రైతులకు స్వేచ్ఛ ఇవ్వటం జరిగిందని, సంచులు, లారీలు కొరత లేకుండా చేసామని తెలిపారు. ఎప్పటికప్పుడు ట్రక్ షీట్‌ల నమోదు సక్రమంగా జరగటం వల్ల రైతులకు ఇబ్బందులు ఎదురవలేదని అన్నారు. గతంలో రైతులు పడిన కష్టాలను పరిగణనలోకి తీసుకొని అటువంటి పరిస్థితి తలెత్తకూడదని ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

పీసా చట్టంపై అవగాహన సదస్సులు

విశాలాంధ్ర-జీలుగుమిల్లి: గ్రామాలలో పలు సమస్యలపై నిర్ణయాలు తీసుకొని తీర్మానం చేస్తే అధికారులు దానిని అమలు చేస్తారని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. మంగళవారం వంకావారి గూడెం పంచాయతీ కార్యాలయం వద్ద

పీసా చట్టంపై అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసా చట్టం ఒక బలమైన చట్టం అన్నారు. సంప్రదాయాలు, ఆచారాలు, సమాజ వనరులు ప్రజల మధ్య వివాదాలను పరిష్కరించు కోవడానికి ఈ చట్టం ఎంతో ఉపయోగపడుతుంది అన్నారు. రాజ్యాంగంలోని నిబంధనలకు అనుగుణంగా పీసా చట్టాలను అమలు చేయవచ్చని అన్నారు. గ్రామాలలో ఉండే ప్రతి ఒక్కరు పీసా చట్టంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మండలంలోని 12 పంచాయతీలలో పీసా చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి తహసిల్దారు సిల్వీవా జోజి, ఎంపీపీ కే పోచమ్మ, బిజెపి ఏలూరు జిల్లా కార్యదర్శి చాట్రాతి ప్రసాదు, బిజెపి మండల అధ్యక్షులు కొండపల్లి ప్రసాదు, జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర-కామవరపుకోట: పేదల సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని టిడిపి సీనియర్ నాయకులు మద్ది పోటి నాగేశ్వరరావు అన్నారు. అనారోగ్యానికి గురై శస్త్ర చికిత్స చేయించుకున్న రామన్నపాలెం గ్రామానికి చెందిన

పాకలపాటి గంగాధరరావు అనే బాధితునికి రూ.1 లక్ష80వేల సీఎం రిలీఫ్ చెక్కును మంగళవారం బాధితునికి అందజేశారు.ఈ సందర్భంగా మద్దిపోటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి ప్రాముఖ్యతను ఇస్తుందని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాలపర్తి రాంబాబు, వడ్లమూడి సత్యనారాయణ, మద్దిపోటి లింగేశ్వరరావు, గోపాల్, రవి,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బి.ఎస్.ఎన్.ఎల్‌ను ప్రజలకు చేరువ చేయండి

విశాలాంధ్ర-ఏలూరు: బిఎస్ఎన్ఎల్‌ను ప్రజలకు మరింత చేరువ అయ్యే విధంగా కృషి చేయాలని టిడిపి ఎస్.సి. సెల్ లాస్ట్ లో ఉపాధ్యక్షులు జాలా బాలాజీ విజ్ఞప్తి చేశారు.

ఏలూరు మండలం మాజీ ఎంపీపీ లంకపల్లి మాణిక్యాలరావు, శాంతినగర్ కు చెందిన మాగంటి మురళీకృష్ణలను టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా స్థానిక శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి)ని మర్యాదపూర్వకంగా కలుసుకొని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జాలా బాలాజీ మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్‌కు పూర్వ వైభవాన్ని తీసుకురావాలని సభ్యులను కోరారు. ప్రజల్లో బిఎస్ఎన్ఎల్ పట్ల నమ్మకం కలిగే విధంగా కృషి చేయాలన్నారు. బి.ఎస్.ఎన్.ఎల్. సంస్థ అంటే ప్రజల్లో గొప్ప విశ్వాసం, నమ్మకంతో సేవలందిస్తున్నప్పటికీ ప్రజల్లో బిఎస్ఎన్ఎల్ పట్ల కొన్ని అపోహలతో ప్రజల వినియోగం తగ్గిపోతుందన్నారు. భారత టెలికమ్యూనికేషన్స్ సేవల పట్ల ప్రజలకు పత్రికా మాధ్యమాల ద్వారా టెలివిజన్ల ద్వారా అవగాహన సదస్సులను, క్యాంపుల ద్వారా చైతన్యపరిచేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తద్వారా ప్రజల వినియోగం పెరిగి బిఎస్ఎన్ఎల్ సంస్థకు పూర్వ వైభవం వచ్చే విధంగా అన్ని చర్యలు చేపట్టాలన్నారు.

జమ్మి శ్రీనివాసరావు మృతికి సీపీఐ మండల సమితి సంతాపం

విశాలాంధ్ర-కామవరపుకోట: సీపీఐ కొయ్యలగూడెం మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు మృతికి సీపీఐ కామవరపుకోట మండల కార్యదర్శి టీవీఎస్ రాజు, సహాయ కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, మంగళవారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు. జమ్మి శ్రీనివాసరావు సీపీఐ కొయ్యలగూడెం మండల కార్యదర్శిగా కొయ్యలగూడెం ప్రాంతంలోని రాజవరం ఎర్రంపేట,చొప్ప రామన్నగూడెం గౌరవరం, తదితర ప్రాంతంలో ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో జరిగిన పోరాటానికి నాయకత్వం వహించారని తెలిపారు. శ్రీనివాస్ పై పోలీసులు ఎన్ని కేసులు బనాయించినా వెనకడుగు వేయకుండా ప్రజల మౌలిక అవసరాల కోసం జరిగిన ఉద్యమానికి నాయకత్వం వహించారని కొనియాడారు. ఆయన మృతి సీపీ, ప్రజా సంఘాలకు తీరని లోటన్నారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

రైతులు అప్రమత్తంగా ఉండండి

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: అకాల వర్షాలకు రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి డి. ముత్యాలరావు తెలిపారు. మండలంలోని అలివేరు, కోట నాగవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు జరుగుతుందని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి కోతలు తాత్కాలికంగా నిలుపుదల చేయాలని తెలిపారు. పంటల నమోదు కార్యక్రమం సద్వినియోగం చేసుకొని ప్రతి రైతు పండించే పంటలను ఈ నమోదు చేసుకోవాలని తెలిపారు. అనంతరం రైతులతో కలిసి మొక్కజొన్న పంటను పరిశీలించి తగిన సలహాలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వినియోగదారులు హక్కులు వినియోగించుకోవాలి

జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి వెల్లడి

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: వినియోగదారుల శ్రేయస్సుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగదారులకు అనేక హక్కులను సమకూర్చిందని వీటిని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ మందిరంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారి ఆర్.ఎస్.ఎస్.రాజు అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ వస్తువుల కొనుగోలులో వినియోగదారులు మోసపోకుండా ఉండాలంటే వారు తప్పనిసరిగా వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగివుండటం ముఖ్యమని స్పష్టం చేశారు. వినియోగదారుల సేవలను సులువుగా విస్తరించే క్రమంలో ఈ సంవత్సరం వినియోగదారు న్యాయపాలనకు వర్చువల్ విచారణకు, డిజిటల్ సౌలభ్యం అంశంపై ప్రతి వినియోగదారుడు వస్తువుల కొనుగోళ్లపై అవగాహన పెంచుకోవాలన్నారు. కొనుగోలులో వస్తువుల ఉత్పత్తి నాణ్యతలోను, రేటులోను, తదితర విషయాల్లో వినియోగదారులు మోసపోతే వెంటనే వర్చువల్ ద్వారా కేసును వినియోగదారుల ఫోరంకు ఫిర్యాదు చేయవచ్చని ఇది ఎంతో సులభతరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వక్తలు జోసఫ్, కట్టా సత్యనారాయణ, రామాంజనేయచార్యులు, రామరాజు, హరిప్రసాద్ తదితరులు వినియోగదారుల హక్కుల పరిరక్షణకు సంబంధించిన విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన,వ్యక్తృత్వ పోటీల్లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను, సర్టిఫికెట్లను ఆయా విద్యార్థులకు జాయింట్ కలెక్టర్ అందజేశారు.

అనంతరం జిల్లాలో వినియోగదారుల వలంటరీ ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులను దుశ్శాలువాతో జాయింట్ కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో విజిలెన్స్ కమిటీ సభ్యులు విజయకృష్ణ, డిఇఓ వెంకట లక్ష్మమ్మ, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజరు వి.శ్రీలక్ష్మి, విద్యార్థినీ, విద్యార్థులు, స్కూలు ఉపాధ్యాయులు, సివిల్ సప్లైయి అధికారులు, తూనికలు, కొలతలు అధికారులు, ట్రాన్స్‌పోర్టు అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: కళాశాలలు, పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో చేపట్టిన మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ పంచాయతీరాజ్, సోషల్ వెల్ఫేర్, ఈడబ్ల్యుఐడిసి, సమగ్ర శిక్ష ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమై ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న ప్రభుత్వ విద్యా సంస్థల పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఇంజనీరింగ్ విభాగం "మనబడి - మన భవిష్యత్తు" పథకం కింద జిల్లాలోని పాలకొల్లు రూరల్, భీమవరం రూరల్, కాళ్ళ, అత్తిలి, యలమంచిలి మండలాల్లోని 154 గ్రామాల్లో వివిధ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై ఆరాతీస్తూ పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 14 జూనియర్ కళాశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల అభివృద్ధికి రూ.132 కోట్లు మంజూరు చేయగా, మన జిల్లాలో 23 సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమ్మత్తులు, మౌలిక వసతులు అభివృద్ధికి రూ.1.29 కోట్లను కేటాయించినట్టు తెలిపారు. గృహ నిర్మాణ శాఖ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. కొణితవాడ సాంఘిక సంక్షేమ వసతి గృహం వద్ద చేపట్టిన డ్రైనేజీ పనులను అత్యంత నాణ్యతతో చేపట్టాలని పి ఆర్ ఇంజనీర్లను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి కె.శ్రీనివాసరావు, జిల్లా ఆర్డబ్ల్యుఎస్ అధికారి నాగేశ్వరరావు, ఇడబ్ల్యుఐడిసి ఈఈ బి.రంగనాథ స్వామి, సమగ్ర శిక్ష డిప్యూటీ డిఈ బి.శక్తేశ్వరరావు, ఇన్చార్జి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి బి వి ఎస్ బి రామాంజనేయ రాజు, ఎఎస్ డబ్ల్యుఓలు, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



విశాలాంధ్ర - బుట్టాయిగూడెం : ఏజెన్సీ చట్టాల పైన ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఏలూరు జిల్లా ఆదివాసీ ఐక్య కార్యాచరణ ఉపాధ్యక్షులు కురసం దుర్గారావు అన్నారు. మంగళవారం మండలంలోని పైడావారిగూడెం లో పీసా గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5వ షెడ్యూల్ ప్రాంతాలల్లో పీసా చట్టం అమలు, దాని ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్ముదుగూడెం పంచాయతీ సర్పంచ్ మడకం రామలక్ష్మి , సెక్రటరీ నాతి సునీల్ కుమార్, ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ మధు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

విశాలాంధ్ర-ఏలూరు: ప్రేమ, కరుణ ద్వారా మానవాళిలో ఆనందం నింపిన ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఏలూరు పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలోని క్రైస్తవ సోదరులకు ఎంపీ మహేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఏసు క్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పర్వదినాన్ని ప్రజలంతా సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఎంపీ మహేష్ కుమార్ ఆకాంక్షించారు.

పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండలంలో రాజవరం, గంగవరం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవులు ఆధ్వర్యంలో నిర్వహించారు. చెన్నకేశవులు మాట్లాడుతూ రబీ సీజన్ కు సంబంధించి వరి, మొక్కజొన్న ,మినుము, పెసర , పంటకు క్రాప్ ఇన్సూరెన్స్ పథకం అమల్లో ఉన్నదని ఈనెల 31 తేదీ లోపల రైతులు ప్రీమియం కట్టి ఎన్రోల్ అవ్వాలని సూచించారు.

మొక్కజొన్న, పొగాకు పొలాలను సందర్శించి, మొక్కజొన్న లో కాండం తుంచే పురుగు, పొగాకులో కాండంకుల తెగులు గమనించడం జరిగిందని , దీని నివారణకు బ్లీచ్ దేర్మ ఎకరానికి ఒక కేజీ చొప్పున పిచికారి చేయాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో హబ్ మేనేజర్ బి.సోమశేఖర్ , వి ఏ. వర్మ , గ్రామ సర్పంచ్ ఏలేటి తుక్కయ్య, కూటమి నాయకులు శ్రీనివాస్, టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

జిల్లాలో ఇంతవరకు 349 గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు

ప్రజల నుంచి 3,734 అర్జీల స్వీకరణ

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లాలో 28 మండలాల్లో మొత్తం 665 రెవిన్యూ గ్రామాలుండగా ఇంతవరకు 349 గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు నిర్వహించినట్టు జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి తెలిపారు. జిల్లాలో మంగళవారం నిర్వహించిన 27 రెవిన్యూ సదస్సుల్లో 212 మంది పాల్గొని ఆయా సమస్యలపై అర్జీలను అందజేయగా వాటిలో అప్పటికప్పుడే 86 అర్జీలు పరిష్కరించినట్టు తెలిపారు. రెవిన్యూ సదస్సులలో అందిన విజ్ఞప్తులను 45 రోజులలోగా పరిష్కరించడం జరుగుతుందన్నారు.

జిల్లాలో ఇప్పటివరకు నిర్వహించిన 349 గ్రామ రెవిన్యూ సదస్సులకు 15,123 మంది హాజరై 3,734 అర్జీలు అందజేయగా ఇప్పటికే 938 అర్జీలు పరిష్కరింపబడ్డాయన్నారు. రెవిన్యూ సదస్సులు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతీ మండలానికి జిల్లా స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించడం జరిగిందన్నారు. జనవరి 8వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో నిర్వహించే రెవిన్యూ సదస్సులలో ప్రజలు పాల్గొని తమ భూములకు సంబంధించిన సమస్యలను తెలియజేసి పరిష్కారం పొందాలన్నారు.

వేగం మితిమీరితే ఇంతే సంగతులు...

విశాలాంధ్ర -ఏలూరు: మితి మీరిన వేగం, నిర్లక్ష్యం, అశ్రద్ధ, మద్యం సేవించి రాష్ డ్రైవింగ్ చేస్తే ఫలితం ఎలా ఉంటుందో ఈ కారును చూస్తే ఇట్టే అర్థమవుతుంది.చెన్నై -కోల్‌కత్తా జాతీయ రహదారిపై భీమడోలు మండలం గుండుగొలను వద్ద రోడ్డు ప్రమాదంలో నుజ్జు నుజ్జయిన కారును పోలీసులు ప్లాట్ ఫారం పై అందరికీ కనపడేలా ప్రదర్శనకు ఉంచారు. ఈ రహదారి పై అటుగా వెళుతున్న డ్రైవర్లు అందరూ వాహనాలను' స్లో ' చేసి మరి భుజాలు తడుముకుంటూ అప్రమత్తమవుతున్నారు. నిదా నంగా వాహనాన్ని నడిపి గమ్యస్థానాలను చేరుకోవాలంటు... రోడ్డు ప్రమాదాల నివారణ, రహదారి భద్రత తెలియజేసే విధంగా పోలీసు శాఖ చేసిన ఈ ప్రయత్నాన్ని అందరూ అభినందిస్తు న్నారు.

మాంటిస్సోరిస్, డాక్టర్ సబిత కాలేజిలో క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-పాలకొల్లు: ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్, డాక్టర్ సబిత కాలేజీ ముందస్తు క్రిస్మస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిలిదేల్ఫియా బైబిల్ ఇన్స్టిట్యూట్ రెవ.టి.ఎస్.ఆర్.ప్రసాద్ రెడ్డి ముఖ్య సందేశకులుగా వ్యవహరించారు. సందేశకులు రెవ.టి.ఎస్.ఆర్.ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఏసుక్రీస్తు గురించి, క్రీస్తు కరుణ, కృప గురించి వివరించారు. తోటి వారి పట్ల ప్రేమతో ఏవిధంగా నడుచుకోవాలో విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. జీసస్ క్రైస్ట్ పుట్టుక, త్యాగఫలాలను గురించి బైబిల్ వాక్యాల ద్వారా వివరించారు. అనంతరం చిన్నారులు సంతాక్లాజ్, దేవదూతల వస్త్రధారణతో అలరిస్తూ పాటలు పాడటంతో పాటుగా డాన్స్‌లు చేశారు.ఈ సందర్భంగా స్కూల్ అడ్మినిస్ట్రేటర్ డైరెక్టర్ శ్రీమద్దాల వాసు

మాట్లాడుతూ ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ లో ఎటువంటి కార్యక్రమాలు అయినా అద్భుతంగా,శ్రద్ధగా, త్రికరణ శుద్ధితో వినూత్నంగా చేస్తామని చెప్పారు. ఈ విద్యాసంస్థ నెలకొల్పి 35 సంవత్సరాలు పూర్తి చేసుకుందని మరో 35 సంవత్సరాలు పైగా మరెన్నో విజయాలను విద్యార్థులకు అందించడానికి మా తర్వాత తరం మేము సిద్ధంగా ఉన్నామని తెలియజేసారు. క్రిస్మస్ వేడుకలకు 1200 మందికి పైగా హాజరయ్యారు. ఎన్నో వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశామని తెలియజేసారు. గెలుపొందిన వారికి బహుమతులను అందించినట్టు తెలిపారు. ఈ క్రిస్మస్ వేడుకలలో పాస్టర్ కరుణాకర్, స్కూల్ కరస్పాండెంటు, సెక్రెటరీ మద్దాల రాంప్రసాద్, ప్రిన్సిపాల్ సామవేదం వసంత లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లికి వందనం తక్షణం అమలు చేయాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయికుమార్

విశాలాంధ్ర-ఏలూరు: తల్లికి వందనం పథకాన్ని తక్షణం అమలు చేయాలని ఏఐ ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సాయి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏలూరు జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం మంగళవారం స్థానిక స్ఫూర్తి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు డి. శివకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎం. సాయి కుమార్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం మొదలై 7 నెలల గడుస్తున్న ఇప్పటివరకు తల్లికి వందనంపై ఒక ప్రకటన కూడా చేయకుండా విద్యార్థులను, విద్యార్థి తల్లిదండ్రులకు కల్లబొల్లి మాటలు చెబుతూ అధికారులు, రాజకీయ నాయకులు, మభ్యపెడుతున్నారని విమర్శించారు. తక్షణమే తల్లికి వందనం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, ధరలకు అనుగు ణంగా మెస్ చార్జీలు పెంచాలని కోరారు.ఈ

కార్యక్రమంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా నిర్మాణ బాధ్యులు మన్నవ కృష్ణ చైతన్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యర్రా మధు,జిల్లా కోశాధికారి ఎం. క్రాంతి కుమార్, జిల్లా గర్ల్స్ కన్వీనర్ లోకేశ్వరి,కో కన్వీనర్ రాజేశ్వరి,ఆఫీస్ బేరర్స్ సమీర్, నాగబాబు, సంతోష్ పాల్గొన్నారు.

పోరుబాట పోస్టరు ఆవిష్కరణ

విశాలాంధ్ర - పాలకొల్లు: స్థానిక వైకాపా కార్యాలయంలో కరెంటు చార్జీల పెంపుపై పోరుబాట పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. పాలకొల్లు నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీన రైతు పోరుబాట కార్యక్ర మం నిర్వహిస్తున్నట్లు పాలకొల్లు నియోజకవర్గ ఇంచార్జి గుడాల శ్రీహరి, గోపాలరావు (గోపి) తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కాకముందే రెండు పర్యాయాలు కరెంటు చార్జీలు పెంచారని, దీనివల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. దళితులకు 200 యూనిట్లు విద్యుత్‌ను ఉచితంగా, వైసీపీ ప్రభుత్వం అందజేస్తే..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచిత విద్యుత్ ను తుంగలోకి తొక్కి పేదల కడుపు కొట్టిందని విమర్శించారు. .ఈ కార్యక్రమంలో కండవల్లి వాసు, ఉచ్చుల స్టాలిన్ బాబు,కోరాడ శ్రీను, సనిశెట్టి భగవన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు ప్రబోధించిన శాంతి మార్గంలో పయనించండి : ఎస్పీ

విశాలాంధ్ర- ఏలూరు : ఏసుక్రీస్తు ప్రబోధించిన శాంతి మార్గంలో ప్రజలం దరూ పయనించి ఇతరుల పట్ల ప్రేమాభిమానాలు చూపాలని ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ సూచించారు. ఈ నెల 25వ తేదీన క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని జిల్లా ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య క్రిస్మస్ పర్వదిన వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న క్రైస్తవ సోదర సోదరీమణులకు ఎస్పీ క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ఆర్టీసీ చైర్మన్ అప్పలనాయుడు

విశాలాంధ్ర- ఏలూరు : ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పర్వదినాన్ని ప్రజలంతా సుఖ సంతోషాలతో జరుపుకోవాలని విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి రెడ్డి అప్పలనాయుడు ఆకాంక్షించారు. ప్రేమ, దయ, కరుణ ద్వారా మానవాళిలో ఆనందం నింపిన ఏసుక్రీస్తు జీవితం ప్రజలందరికీ అనుసరణీయమని ఆయన అన్నారు. ఏసుక్రీస్తు అందించిన శాంతి, ప్రేమ, దయ, ఐకమత్యం సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచిస్తూ. క్రిస్మస్ పండుగతో ప్రతి వెంట శాంతి, సౌభాగ్యాలు నెలకొనాలని క్రైస్తవ సోదర సోదరీమణులకు అప్పలనాయుడు క్రిస్మస్ పండుగ శు భాకాంక్షలు తెలిపారు.

సీపీఐకి వందనం (1వ పేజీ తరువాయి)

ఉండటం ఎంతో గర్వకారణం. స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ రూపకల్పనకు అనేక సూచనలు చేసిన పార్టీ సిపిఐ. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు, ఎంతోమంది ప్రాణత్యాగాలతో కమ్యూనిస్టు పార్టీ ముందుకు సాగింది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రరాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య వంటి నేతలు అనేక భూ పోరాటాలు చేసి పేదలకు భూములను దక్కేలా చేశారు.

బెంగాల్‌లోని జమీందార్లకు వ్యతిరేకంగా కౌలు రైతులు వీరోచితమైన పోరాటం నడిపారు. దీన్ని పేరుగాంచిన 'తెభాగా' పోరాటం అంటారు. అంతకుముందు పండినపంటలో మూడింట రెండు భాగాలు జమీందార్లు తీసుకొనేవారు. మూడింట ఒకవంతే కౌలు చెల్లిస్తామని కౌలుదార్లు పోరాటం ప్రారంభించారు. కౌలుదార్లు కుప్పలు కొట్టి, ఒక భాగం విడిచిపెట్టి మిగిలిన రెండుభాగాలు తెచ్చుకునేవారు. కొన్ని ప్రాంతాలలో కౌలు తగ్గించమని, అది కూడా ధాన్యం గాకుండా డబ్బుగా యిస్తామని పోరాటం సాగించారు. ధాన్యం జమీందార్లకు యివ్వకుండా కౌలురైతులు తమ ఇండ్లకే తీసుకెళ్ళేవారు. కమ్యూనిస్టు పార్టీ, రైతుసంఘం నాయకులు వీరికి సహాయ పడేవారు. ఈ పోరాటం 1946 ఆగస్టులో జరిగింది. ఒక్క నెలలో 11 జిల్లాలకు ఈ పోరాటం పాకింది.పోలీసులకు, రైతులకు అనేక పోరాటాలు జరిగాయి. ఇద్దరు పోలీసులు చనిపోయారు. ఈ పోరాటంలో ఎంతోమంది రైతులు వీరోచితంగా పోరాడి చనిపోయారు.అలా అనేక పోరాటాల తర్వాత కౌలురైతులకు హక్కులు లభించాయి. నిజాం నిరంకుశ పరిపాలనను అంతమొందించి ప్రజాతంత్ర స్థాపన కోసం పోరాటం సాగింది. ఫ్యూడల్ భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా, వ్యవసాయ కార్మికులు, రైతాంగం ఆదివాసి ప్రజానీకం జరిపిన గొప్ప వ్యవసాయిక,సాయుధ విప్లవ పోరాటమది. సంస్థానాన్ని భాషాప్రయుక్త రాష్ట్రాలుగా రూపొందించేం దుకు సాగించిన పోరాటం అది. నిజాం గులా ములుగా వున్న దేశ్‌ముఖ్ లు, జాగీర్దార్లు ప్రజలను బానిసలుగా గుంజారు. వెట్టి చేయించుకున్నారు. వారిని దోపిడి చేశారు. వారిపై దౌర్జన్యాలు చేశారు."నీ బాన్సును దొరా" అని ఎంతో భయపడే వ్యవసాయ కూలీలను పేద రైతులను కమ్యూనిస్టు పార్టీ, సంఘంలో చేర్చింది. వారిలో వారికి తెలియని బలాన్ని చూపింది, చైతన్యాన్ని కలగజేసింది. వ్యవసాయ కార్మికులకు కూలిరేట్లు పెంచారు.1964 లో అధిక ధరలకు వ్యతిరేకంగా పార్టీ సత్యాగ్రహం నడిపింది. వేలాదిమంది అరెస్టు అయ్యారు. లక్షలమంది ప్రదర్శనల్లో పాల్గొన్నారు. 1964 నుండి 1966 వరకు అధికధరలకు వ్యతిరేకంగా కార్మిక వర్గము, ఇతర ప్రజలు అనేక పోరాటాలు నడిపారు. కేరళ, మహారాష్ట్ర,గుజరాత్, ఉత్తర ప్రదేశ్, గోవా, బెంగాల్, ఆంధ్రప్రదేశ్, బీహారు బంద్‌లు జరిగాయి. వీటిని కమ్యూనిస్టులు ముందుండి నడిపారు. ఇక సమ్మెలకు లెక్కలేదు. లక్షల కొలది కార్మికులు పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా సమ్మెలు చేశారు. వీరు అందరికంటే మిక్కిలి పేదవారు గ్రామాలలో కూలీలు, కోట్లకొలది వున్నారు. వీరికి 1968 సెప్టెంబరులో దేశానికి అంతకూ కలిసి సంఘం ఏర్పడింది. దీనినే భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ అంటారు. తెలుగులో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అంటారు. ఈ సంఘం ఏర్పడి కొద్ది సంవత్సరాలే అయినా, అది అనేక పోరాటాలు నడిపింది.

1957 ఎన్నికలలో కేరళలలో గెలిచి ప్రజాస్వామ్య బద్ధంగా గెలిచిన తొలి కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వం అనే రికార్డును సొంతం చేసుకోగలిగారు. దాదాపుగా ప్రతి రంగాన్ని నాడు కమ్యూనిస్టులు ప్రభా వితం చేయగలిగారు. కార్మిక సంఘాలలో వారే నెంబర్ వన్. రైతు కూలీ ఉద్యమ నిర్మాణం వారిదే.మహిళా సంఘాలు స్థాపించారు.రైతాంగ సమస్యపై ఉద్యమాలు నడిపారు. విద్యార్థి సంఘాలు వారు నిర్మించినవే.

జిల్లాలో సిపిఐ ప్రాధాన్యత

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమానికి అత్యంత ప్రాధాన్యత, ఘన చరిత్ర ఉంది. స్థానిక సమస్యలపై పోరాటాలతో ఎన్నో విజయాలు సిపిఐ సాధించింది. జిల్లాలో స్వాతంత్రోద్యమంలో నిబద్ధతతో ఉద్యమం చేసి ఎంతో మంది నాయకుల ప్రాణ త్యాగాలతో సిపిఐ తన వంతు పాత్ర పోషించింది. సమాజానికి కమ్యూనిస్టుల అవసరం ఎంతైనా ఉందని చాటి చెప్పింది. సిపిఐ తన ప్రస్థానంలో ఉమ్మడి పశ్చిమలో ఏజెన్సీలో భూ సమస్యలు, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల అవస్థలు, చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణం, అటవీ బంజరు భూముల పంపిణీ, వన సంరక్షణ సమితి సభ్యులకు యాజమాన్య హక్కులు, ఏజెన్సీ ప్రాంతంలో అనాదిగా గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు యాజమాన్యపు హక్కు పత్రాలు, వివిధ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికుల స్థితిగతులు, అసంఘటిత రంగ కార్మికులు , ఉపాధి హామీ కూలీలు, మహిళలు, యువత, విద్యార్థులు, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఐ అలుపెరుగని పోరాటం చేసిన చరిత్ర ఉంది. ప్రత్యేకించి రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం నిర్వాసితుల పరిహారం, పునరావాసం, విశాఖ రైల్వే జోన్ వంటివి కేంద్రం చేతిలో ఉన్న పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ సిపిఐ తన ఉద్యమాల ద్వారా ప్రజలలోకి విస్తృతంగా తీసుకువెళ్లి అవగాహన కల్పించడంలో విశేష కృషి చేసింది.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం పరిచేలా సదస్సులు,రౌండ్ టేబుల్ సమావేశాల ద్వారా అవగాహన కల్పించడంలో సిపిఐ అగ్ర భాగాన ఉందనడంలో సందేహం లేదు. ఇలా కమ్యూనిస్టు పార్టీ, ప్రజాసంఘాలు పుట్టింది పోరాటాల్లో పెరిగింది,పెరుగుతున్నదీ పోరాటాల్లో్..ప్రదర్శనలు, ధర్నాలు, ఘోరావ్ లు,ఊరేగింపులు,సత్యాగ్రహాలు, సమ్మెలు, పికెటింగులు, నిరాహారదీక్షలు, దొంగనిల్వ లను బయటకు లాగటం, గెరిల్లా సాయుధ పోరాటాలు, భూమి పంపకము,గ్రామ రాజ్యాల స్థాపన, బంజర్లసాగు, భూమి ఆక్రమణలు,బంద్‌లు ఇలా ఎన్నో సమరశీల పోరాటాలను నడిపింది పార్టీ . ఇంత ఘన చరిత్ర కలిగి ఉన్న సిపిఐ శత వసంతాలు జరుపుకుంటున్న క్రమంలో క్షేత్రస్థాయి జాతీయ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసే దిశగా పార్టీ శ్రేణులు కృషి చేయాలి. ఈ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షిద్దాం.

విశ్వకర్మ యోజన పథకం, కార్పెంటర్ సమస్యలపై ఆర్డీవోకి వినతి



విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా రామచంద్రపురం కార్పెంటర్స్ సంఘం. శ్రీ కామాక్షి దుర్గా కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అప్పారి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణ మూర్తి పాల్గొని రామచంద్రపురం ఆర్డిఓ డి అఖిలకి విశ్వకర్మ యోజన, కార్పెంటర్ కార్పెంటర్ సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. జిల్లా అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వకర్మ యోజన పథకం ఆన్‌లైన్ చేశామని, ఇప్పటికి గుర్తింపు కార్డులు వచ్చినవి, వీరికి శిక్షణా తరగతులను రామచంద్ర పురంలో నిర్వహించాలని, శిక్షణ కార్యాలయమును కూడా ఇక్కడే నిర్వహించాలని, టింబర్ డిపోలో వేప కర్రతో గుమ్మాలు కిటికీలు తలుపులు వంటివి రెడీమేడ్ తయారు చేయడం వలన చేతి వృత్తుల కార్పెంటర్ వారికి ఉపాధి లేకుండా పోతున్నది, రెడీమేడ్ పై ఆంక్షలు విధించాలని, కార్పెంటర్ పనివారు ఇతర రాష్ట్రాల నుండి(బీహార్ ఉత్తరప్రదేశ్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పని చేయుట వలన ఉపాది కోల్పోతున్నామని, వారిని అరికట్టాలని సమస్యలపై రెవెన్యూ డివిజనల్ అధికారి డి అఖిలకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గానాల సాయి, రామోజు శ్రీనివాస్, దంగేటి రామకృష్ణ, మండపాక నాగేశ్వరరావు, అద్దాల వీర బ్రహ్మం, తామరపల్లి వీరబాబు, బలగం ప్రసాద్, గున్నేపల్లి భీమశంకరం తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు ఎమ్మెల్యే దంపతుల ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - అనపర్తి : విజయవాడ ఇంద్రకీలాద్రిలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామిని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. మంగళవారం దుర్గమ్మ తల్లిని దర్శించుకుని ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వచనాలు పొందారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తల్లి, సోదరి నల్లమిల్లి సత్యవతి,టి విజయలక్ష్మి ఉన్నారు.

క్రీస్తు బోధనలు మానవాళికి స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర - కడియం : క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి స్ఫూర్తిదాయకమని తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టికె విశ్వేశ్వర రెడ్డి పేర్కొన్నారు. కడియం మండలం, బుర్రిలంక గ్రామం, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, కాంగ్రెస్ పార్టీ రూరల్ కోఆర్డినేటర్ తాడాల కొండ్రాజు ఆధ్వర్యంలో, తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టికె విశ్వేశ్వర రెడ్డి, జేటి రామారావు అధ్యక్షతన క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. విశ్వేశ్వర రెడ్డి, రామారావు, కొండ్రాజు మాట్లాడుతూ సమాజంలో ప్రేమ, సామరస్యం, సోదర భావాలను పెంపొందించేందుకు యేసుక్రీస్తు బోధనలు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా మహిళా అధ్యక్షురాలు శారద, వివిధ నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ లు చైతన్య రెడ్డి, డాక్టర్ వడియార్, శ్రీను, హుస్సేన్, వెంకటేశ్వరరావు, మార్టిన్ లూథర్ మరియు మండలంలోని పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర - అమలాపురం : ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిరుద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు, విద్యావేత్తల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేపకాయల రాజు ఎన్నికల ప్రచారాన్ని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి గన్నవరం నియోజవర్గం, అయినవిల్లి మండలం, అయినవిల్లి గ్రామంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల కార్యాలకు అధిపతి, స్వయంభువుగా వెలసిన గణపతి క్షేత్రం అయినవిల్లి గ్రామం నుండి తన ప్రచారాన్ని ప్రారంభించా మన్నారు. తన వెనుక పార్టీలు లేవని పట్టభద్రులే తన బలం, బలగం అని పేర్కొన్నారు. కుల, మత, రాజకీ యాలకు అతీతంగా ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించే దిశగా అడుగులు ముందుకు వేస్తున్నానన్నారు. స్థానిక పూలతోటలో ఉన్న నర హరిశెట్టి వెంకట్రావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యా పకులు, అధ్యాపకేతర సిబ్బంది, స్థానికం గా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న పట్టభద్రులతో మాట్లాడి రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్ని కల్లో మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేయ్యాలని అభ్యర్థించారు. పట్టభద్ర సోదర, సోదరీ మణులు అందరూ మద్దతుగా నిలబడి తనకు విజయాన్ని చేకూర్చాలని కోరారు.

మండల యూటీఎఫ్ అధ్యక్షుడిగాశ్రీనివాసరావు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ప్రత్తిపాడు హైస్కూల్ లో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు నగేష్ అధ్యక్షతన యూటీఎఫ్ నూతన బాడీ కౌన్సిల్ నిర్వహించారు.దీనికి ఎన్నికల అధికారిగా జిల్లా గౌరవాధ్యక్షులు సాయిరాం, జిల్లా కార్యదర్శి నూకరాజు, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు వివి రమణ, జిల్లా కుటుంబ సంక్షేమం డైరెక్టర్ ఆర్ రామలింగేశ్వరరావు హాజ రయ్యారు. ఈ కార్యక్రమానికి మండలంలోని సుమారు 90 మంది ఉపా ధ్యాయులు హాజరైనారు. జిల్లా అధ్యక్షులు నగేష్ మాట్లాడుతూ విద్యారం గాన్ని బలోపేతం చేయడానికి ఉపాధ్యాయులు కృషిని వివరించారు. గౌరవాధ్యక్షులుగా ఆర్ సూర్యనారాయణ, యుటిఎఫ్ మండల ప్రెసిడెంట్‌గా కోడి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రాజబాబు, అసోసియేట్ అధ్యక్షులు ఎస్ నాగేశ్వరరావు, అసోసియేట్ మహిళా అధ్యక్షులు సిహెచ్ సూర్యావతి, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ వి రవితేజ, పత్రికా సంపాదికులు ఎం రమేష్, ఆడిటర్ ఎం స్వామి కుమార్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి మండలంలోని సీనియర్ ఉపాధ్యాయులు ప్రసాద్ బాబు, సిహెచ్ఎల్ గణేష్ ఎస్ రాజేష్, పనసయ్య తదితరులు పాల్గొన్నారు.

భాష్యం స్కూల్లో సెమి క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి భాష్యం స్కూలులో సెమి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు .విద్యార్థులు శాంతాక్లాజ్, దేవదూతల వేషధారులై ఏసుక్రీస్తు జీవిత విశేషాలపై పాటలు పాడి నృత్యాలు చేసారు. ఈ కార్యక్రమంలో బాష్యం స్కూల్ ప్రిన్సిపల్ పి. పేరయ్య నాయుడు మాట్లాడుతూ అందరికి ప్రేమనుపంచి సేవాగుణం అలవర్చుకున్న వారిపై దేవుని ఆశీస్సులు ఉంటాయని ,దీనుల పట్ల ఇతర జీవరాశులపై దయ, కరుణ కలిగి వుండాలని, ప్రతి ఒక్కరు సహనాన్ని ఆలవర్చుకోవడం క్షమ కలిగి వుండడమనే లక్షణాలు - దేవునికి దగ్గరచేస్తాయనే సత్వాలను జీసస్ క్రైస్ట్ బోధనల ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు. సర్వమత సామరస్యం విద్యార్థుల్లో అలవర్చడంకోసం అన్ని పండుగలను భాష్యం సూల్లో నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో భాష్యం చాంప్స్ ప్రిన్సిపల్ షేక్ షబాన, పి. వెంకటేశ్వరరావు, సుదీషా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శంగా నిలిచిన జనసైనికులు ...

విశాలాంధ్ర - నల్లజర్ల : తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి, దేవరపల్లి గ్రామాం నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నల్లజర్ల వచ్చేసరికి లారీనీ వెనకనుంచి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు అంబులెన్స్‌లు అందు బాటులో లేకపోవడంతో సుమారు గంటకు పైగా నల్లజర్లలో గాయలతో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ సమాచారం అందుకున్న నల్లజర్ల గ్రామానికి చెందిన ఉన్న మట్ల సత్య అనే జనసేన నాయకులు ఘటన స్థలానికి హుటాహుటిన చేరుకొని గాయల పాలైన వ్యక్తిని భీమడోలు నుంచి అంబులెన్స్‌ని రప్పించి ఆసుపత్రికి తరలించడంతో స్థానికులు జనసేన పార్టీకి, వారి నాయకులకు అభినందనలు తెలియజేశారు. నేటి సమాజంలో మానవత్వం ఇంకా బ్రతికే ఉందని జనసేన రూపంలో నాయకుల ద్వారా అది అర్థమైందని స్థానికులు ప్రశంసలు కురిపించారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - ఏలేశ్వరం : యునైటెడ్ టీచర్ ఫెడరేషన్ ఏలేశ్వరం శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం స్థానిక పెన్షనర్స్ హెూమ్‌లో జిల్లా బాధ్యులు జట్ల సోమరాజు ఆధ్వర్యంలో జరిగింది. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్ సంజీవ్, కే రవి ఎన్నిక కాగా గౌరవ అధ్యక్షునిగా జి సుందర్రావు, అసోసియేట్ అధ్యక్షులుగా బి రాంబాబు, ఎన్ నాగమణి, కోశాధికారిగా టీ మురళీకృష్ణ, సహ కార్యదర్శులుగా ఓ రాజు, జే అప్పారావు, పి గంగాధర్ రావు దొర, కె దేవదేవి, డి శిరీష, ఎన్ శ్రీనివాసరావు, జీవివి సత్యనారాయణ, ఎం శ్రీనివాసరావు, వి వీరబాబు, విఆర్‌కె రెడ్డి, ఆర్ నాగేంద్రరావు, ఆడిటర్‌గా ఎన్ రాజు ఎన్నికయ్యారు.

పంచాయతీలో ఏ పని చేసినా తీర్మానం తప్పనిసరి

ఎంపీడీఓ భారతి

విశాలాంధ్ర - సీతానగరం: పంచాయితీలో ఏ పని చేసినా తీర్మానం తప్పనిసరి అని ఎంపీడీఓ భారతి అన్నారు. మండలంలో రఘుదేవపురం గ్రామ పంచాయితీలో మంగళవారం ఎంపీడీఓ ఎమ్ భారతి, ఈ ఓ పి ఆర్డీ కెవిఎస్ఎస్ఎస్ మూర్తి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, సచివాలయం సిబ్బందికి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపిడిఓ మాట్లాడుతూ పంచాయితీలో గుండు సూది కొన్నా పంచాయితీ తీర్మానం తప్పనిసరి అని అన్నారు. పంచాయతీలో నీటి, అస్తి పన్నులను త్వరిత గతిన వసువులు చేయాలని ఆదేశించారు. కట్టించుకున్న నగదును అలాగే వాడకుండా బ్యాంకు లో వేసి బిల్లులు ద్వారా వాడుకోవాలని సూచించారు. పంచాయతీలో వివిధ పనులు చేస్తున్న ప్రవేటు సిబ్బంది నియామకం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకే జరగాలని అన్నారు. అలాగే ఉచిత ఇసుక విధానం అమలులో భాగంగా పంచాయితీ పరిధిలో 300 గజాల ఇళ్ళ నిర్మాణానికి రుడా ఆమోదం అవసరం లేదు అని పంచాయితీ ఆమోదం చాలు అని అవసరా నికి అనుగుణంగా స్థానిక ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ద్వారా ఇసుక ఎంత పడుతుందో అంచనా వేసి అనుమతులు జారీ చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. ఇక పై పంచాయితీలో ఏ విధమైన నగదు చెల్లింపుల జరిపినా బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. గతంలో పంచాయితీలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇందుగుమిల్లి చంద్రలీల, అదనపు కార్యదర్శి భార్గవి, కంప్యూటర్ అసిస్టెంట్ జగదీష్, కాంద్రు శ్రీనివాసరావు, గెద్దాడ త్రిమూర్తులు, దాసరి రమేష్, బి సూరిబాబు, అచ్యుత్త రామరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విధిగా హెల్మెట్ ధరించాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ద్విచక్ర వాహనా లపై వెళ్ళే వారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని గండేపల్లి, జగ్గంపేట ఎస్ఐలు శివనాగబాబు, రఘు నాథరావు మంగళవారం సిబ్బంది, మహిళ పోలీసులతో కలిసి హెల్మెట్లు ధరించి బైక్‌లపై ర్యాలీ చేశారు. తొలుతగా జగ్గంపేట ఆర్టీసి కాంప్లెక్స్ నుండి హైవే మీదుగా రామవరం జంక్షన్ వెళ్ళి మరలా హైవే బ్రిడ్జి మీదుగా జెడ్ రాగంపేట వరకు ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో హెల్మెట్ దరిద్దాం, రోడ్డు ప్రమాదాలలో మరణాల తగ్గిందామని ప్రచారం చేశారు.

ఉత్తమ పరిశోధకుడిగా యర్రంశెట్టి

విశాలాంధ్ర - మామిడికుదురు : కరేబి యన్ సైన్స్, టెక్నాలజీస్ ఇన్వెడ్ జర్నల్‌లో మామిడి కుదురు దీప్తి డిగ్రీ కళాశాలకు చెందిన ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి డాక్టర్ యర్రం శెట్టి విజయసత్య ప్రసాద్ సమర్పించిన "బ్యూటిఫుల్ రిలేషన్షిప్ బిట్వీన్ నానో టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్" పరిశోధన పత్రానికి ఉత్తమ పరిశోధన పత్రం అవార్డు లభించింది. అలాగే నానో టెక్నా లజీ, కంప్యూటర్ సైన్స్ రెండూ ఒక దానిపై ఇంకొటి ఆధారపడే విధానం, కంప్యూటర్‌లో నానో పదార్థాలు ఉపయోగపడే వైనం లాంటి విషయాలను అందులో వివరించినందుకు ఆయన "ఉత్తమ పరిశోధకుడు" అవార్డు కూడా అందుకున్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో తిరుచానూర్ శ్రీ పద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మసీలో జరిగిన అంతర్జాతీయ సమా వేశంలో ఆయన ఈ అవార్డులను అందుకున్నారు. ఆంధ్ర, ఆదికవి యూనివర్సిటీలు, జేఎన్టీ యూకే పూర్వపు వీసీ సుంకర రామకృష్ణా రావుతో పాటు రాష్ట్రంలో పలు యూనివర్సిటీల రిజిస్ట్రార్లు, అధికారులు ఆయనకు ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యర్రంశెట్టిని దీప్తి విద్యా సంస్థలు చైర్మన్ డివివి సత్యనారాయణ, సాయిదీప్తి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శివ ప్రసాద్, దీప్తి సహాయ ప్రిన్సిపాల్ మోకా రంగారావు, ఆయా అధ్యాపకులు అభినందించారు.

బి దొడ్డవరంలో రూ.2.50 లక్షలు దొక్కాతాడు దగ్ధం

విశాలాంధ్ర - మామిడి కుదురు : బి దొడ్డవరంలో ఎగుమతికి సిద్ధంగా ఉన్న రూ. 2.50 లక్షలు విలువైన దొక్క తాడు మంగళ వారం ఉదయం మూడు గంటల సమయంలో దగ్ధమైంది. హైద రాబాద్ ఎగుమతి చేసేందుకు ఈ తాడు ను గోడౌన్ బయట సిద్ధం చేశారు. ఆరు టన్నుల విలువైన దొక్కతాడు పూర్తిగా కాలిపోయిందని బాధితులు చింతపల్లి శ్రీనివాస్, బొలిశెట్టి ప్రసాద్ వాపో యారు. మంటలను ఆర్పేందుకు స్థానికులు ఎంతగా ప్రయత్నించినప్పటికీ ఫలితం దక్కలేదు.

సహస్ర ఇంటర్నేషనల్ స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురంలోని సహస్ర ఇంటర్నేషనల్ స్కూల్‌లో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో స్కూల్ డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ గౌసియా బేగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్కూల్ యాజ మాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

విశాలాంధ్ర - కాకినాడ : గౌరవ జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాని ఎస్టీయూ కాకినాడ జిల్లా శాఖ పక్షాన కలిసి ఈ క్రింది సమ స్యల మీద ప్రాతినిధ్యం చేసింది.1) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జిల్లా ప్రజా పరిషత్ పరిధిలో చనిపోయిన ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులకు తరగతిన కారుణ్య నియామకాల ద్వారా పోస్టింగ్‌లు ఇవ్వాలి. 2) గత రెండు సంవత్సరాల(202-22 శి 2023-24) నుండి ఇప్పటివరకు 91 మంది ఉద్యోగ ఉపాధ్యాయ కుటుంబ సభ్యులు కారు ణ్య నియామకానికి దరఖాస్తు చేసి ఉన్నారు. 3) కారుణ్య నియామకాల్లో జాప్యం వలన వారి కుటుంబ సభ్యుల ఆర్థిక, మానసిక ఇబ్బందులు దృష్ట్యా సూపర్ న్యుమర్ పోస్టులు సృష్టించి వారికి త్వరగతిన పోస్టింగులు ఇవ్వాలని కోరుతున్నారు.

అమిత్‌షాను భర్తరఫ్ చేయాలి

విశాలాంధ్ర - కడియం : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమాన పరిచే విధంగా భారత పార్లమెంట్‌లో మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు టికె విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. కడి యం మండలం బుర్రిలంక గ్రామంలో కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి రూరల్ కోఆర్డినేటర్ తాడాల కొండ్రాజు స్వగృహంలో జరిగిన కడియం మండల పార్టీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల ఆదేశానుసారం మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అమిత్ షా ను భర్తరఫ్ చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మార్టిన్ లూథర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోతా శారద, తాడాల కొండ్రాజు, జెటి రామారావు, కాకర్ల శ్రీహరిబాబు, కారంకి వెంకటేశ్వరరావు, ఎండి ఫషీ ఉల్లా బేగ్, మేడవరపు భద్రం దొర, డాక్టర్ వడయార్, డాక్టర్ శ్రీనివాస్, అబ్దుల్లా షరీఫ్, పట్నాల శ్రీనివాస్, చిన్నం మురళీకృష్ణ, సాక పుల్లారావు, పాలకుర్తి చౌదరి మరియు తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ కోఆర్డినేటర్లు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజేశ్వరి సేవలు మరువరానివి

విశాలాంధ్ర - పిఠాపురం : దివంగత నేత, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ దేవరపల్లి రాజేశ్వరి పిఠాపురం పట్టణానికి చేసిన సేవలు మరువరానివని మాజీ ఎంపీ, పిఠాపురం నియోజవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వంగా గీత విశ్వనాథ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏపీ సిసి సెక్రెటరీ మేడిది వెంకట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దేవర పల్లి రాజేశ్వరి 15వ వర్థంతి సందర్భంగా స్థానిక పిఠా పురం ఆర్ఆర్ పార్క్‌లో ఏర్పాటు చేసిన రాజేశ్వరి విగ్రహానికి నాయకులు పూలమాలను వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ మాట్లాడుతూ రాజేశ్వరి పిఠాపురం మున్సిపాలిటీకి ప్రథమ మహిళా చైర్మన్‌గా పనిచేసి, పట్టణానికి ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఆవిడ లేని లోటు మరువరానిదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన పార్టీ నాయకుడు డాక్టర్ పిల్లా శ్రీధర్, చెల్లుబోయిన సతీష్, కాకినాడ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మల్లిపూడి రాంబాబు, పంతం నెహ్రూ, పిఠాపురం మున్సిపల్ చైర్మన్ గండేపల్లి సూర్యావతి బాబి, మాజీ మున్సిపల్ చైర్మన్, కాకినాడ జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధినిడి సుజాత, గుణ్ణం మైథిలి, శ్రీ ఉమా కుక్కుటేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ ఆగంటి ప్రభాకర్, శ్రీపాద శ్రీ వల్లభ మహాసంస్థానం మాజీ చైర్మన్ రెడ్డెం జనార్దన్, కౌన్సిలర్ తలిశెట్టి వెంకటేశ్వరరావు, సోము సత్తిబాబు, బొజ్జా దొరబాబు, రామయ్య, కోనేటి రాజు, గ్రంధి గణేష్ తదితర పార్టీల నాయకులు, అభిమానులు, నియోజకవర్గ ప్రజలు పాల్గొన్నారు.

డాక్టర్ అడ్డాల సేవలు యువతకు ఆదర్శనీయం

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జాతీయ దంతవైద్యుల దినోత్సవం నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈ వివిఎల్ నాయుడు తెలియజేశారు. ఆధునిక దంతవైద్య పితామహులు పద్మ భూషణ్ డాక్టర్ ఆర్ అహ్మద్ జయంతిని ప్రతి సంవత్సరం జాతీయ దంత వైద్యుల దినోత్సవంగా జరుపుకుంటారు. ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణను అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ డాక్టర్ అడ్డాల సత్యనారాయణ సేవలు యువతకు ఆదర్శమని అన్నారు. డాక్టర్ అడ్డాల 26 సంవత్సరాలుగా కాకినాడ, పరిసర గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందిస్తు న్నారని కొనియాడారు. దంత వైద్యుడు, విద్యావేత్త, పశ్చిమ బెంగాల్ మంత్రివర్గంలో మంత్రి, భారత దేశం మొదటి దంత కళాశాల స్థాపించిన డాక్టర్ ఆర్ అహ్మద్, డెంటల్ కాలేజ్, హాస్పిటల్‌ను స్థాపిం చారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారా యణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు తేజేశ్వరరావు, గౌరీ ప్రియ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విజ్ఞాన్ కాన్వెంట్ విద్యారుల ప్రతిభ

విశాలాంధ్ర - తాళ్లరేవు : కాకినాడలో ఆదివారం జరిగిన 3వ అంతర్ రాష్ట్ర ఇన్విటేషనల్ కరాటే పోటీల్లో మండలంలోని జార్జిపేట విజ్ఞాన్ ఆంగ్ల మాధ్యమం పాఠ శాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ జివివి శ్రీని వాస్ మంగళవారం తెలిపారు. ఏడో తరగతి చదువుతున్న వర్షిత్ (ప్రథ మం), దుర్గా వెంకట్, మనోహర్‌లు (ద్వితీయం) స్థానాల్లో నిలిచినట్లు చెప్పారు, శిక్షకులు శేఖర్ విద్యార్థులను అభినందించారు.

రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా కార్యాచరణ

విశాలాంధ్ర - మామిడికుదురు : రెవెన్యూ సమస్యల శాశ్వత పరిష్కార దిశగా కూటమి ప్రభుత్వము ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతుందని పి గన్నవరం టిడిపి కన్వీనర్ నామన రాంబాబు అన్నారు. మగటపల్లిలో సర్పంచ్ సూరిశెట్టి లక్ష్మి చంటిబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. రెవెన్యూ పరమైన అంశాలు, భూములు వివాదాలకు సంబంధించిన కోర్టు కేసుల్లో అధికారులు త్వరితగతిన స్పందించాలన్నారు. ఎంఆర్‌వో వైవి సుబ్రహ్మణ్యాచార్యులు ప్రజల నుంచి ఆర్జీలు స్వీకరించి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ సదస్సులో నామన నాగేశ్వరరావు, బొలిశెట్టి ఏసుబాబు, సూరిశెట్టి బాబి, కుంపట్ల బాబ్జి, సింహాచలం పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

విశాలాంధ్ర - జగ్గంపేట : స్థానిక పాత పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం నిర్వహించిన డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై పేదలకు భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ఐదు నెలల నుంచి డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహిస్తున్నామన్నారు. ఆకలి అన్నవారికి లేదు అనకుండా డొక్క సీతమ్మ అన్నం పెట్టారని, అటువంటి ఆమెను మా నాయకులు పవన్ కళ్యాణ్ ఆదర్శంగా తీసుకుని ఆకలి అన్న వారికి అన్నం పెడుతున్నారన్నారు. అలానే మేము పవన్ కళ్యాణ్‌ను ఆదర్శంగా తీసుకుని ఇక్కడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మరిసే రామకృష్ణ, రాజనాల శ్రీను, సూరపురెడ్డి నరేష్, మాదారపు వీరబాబు, నాయకులు పాల్గొన్నారు.

కోలుకున్న విద్యార్థి జహ్నవి

విశాలాంధ్ర - కరప : కరప మండలం నడకుదురు ప్రాథమిక పాఠశాలలో చదువు తున్న విద్యార్థిని జాహ్న వి కాలిన గాయాలతో క్యాపిటల్ హాస్పటల్‌లో చికిత్స పొందుతూ కోలుకుంటుందని యంగ్ మైండ్ స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు వాకాడ వెంకటరమణ పేర్కొన్నారు. పాప ఆరోగ్యం కోసం తమ స్వచ్ఛంద సేవ సంస్థ ద్వారా ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు. పాప కోలుకో వడంతో ఆరోగ్యానికి అవసరమైన ఖర్చులుకు ఐదు వేల రూపాయలు అందించారు. ఉపాధ్యాయులు కేసునంద, పాపకి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

వేలంగి గ్రామంలో రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర - కరప : మండలంలోని వేలంగి గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. రైతులు పాల్గొని భూ సంబంధ సమస్యలపై ఆర్జీలు అందించారని తహశీల్దార్ సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్, సర్వేయర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు కృషి
టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

విశాలాంధ్ర - జగ్గంపేట : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరిచేందుకు సిఎం చంద్రబాబు, పంచా యతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని టీడీపి కాకి నాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. మండలంలోని మామిడాడ గ్రామ పంచాయతీకి నూతనంగా ట్రాక్టర్‌ను కొనుగోలు చేయడం తో ఆ వాహనానికి నవీన్ టీడీపి నియోజకవర్గ కార్యాలయంలో పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంకల్పం గ్రామాలు పరిశుభ్రంగా ఉండటమన్నారు. మామిడాడ పంచాయతీ నూతన ట్రాక్టర్ కొనుగోలు చేసి పారిశుధ్య నిర్వహణకు కృషి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రామకృష్ణ, టిడిపి ఎస్సీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పోతుల మోహన్ రావు, కొత్త కొండబాబు, జీను మణిబాబు, నీలం శ్రీను, కర్రి శ్రీనివాస్, పెంటకోంట సత్తిబాబు, వెంకటేశ్వర్లు, దూర్గబాబు, సుమన్ పాల్గొన్నారు.

27 నిర్వహించే నిరసన కార్యక్రమానికి తరలిరావాలి : ముద్రగడ గిరి బాబు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపుతున్న సందర్భంగా రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఈనెల 27న రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా నియోజకవర్గ కేంద్రం అయిన ప్రత్తిపాడు విద్యుత్ కార్యాలయం వద్ద చేపడుతున్న నిరసన కార్యక్రమానికి నియోజకవర్గ వైసిపి నాయకులు, కార్యకర్తలకు తరలిరావాలని వైసిపి నియోజవర్గ ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు పిలుపు నిచ్చారు.

నష్టపరిహార సాధనకు ఐక్య పోరాటం
కాంగ్రెస్ నాయకులు ప్రసాద్‌రాజు పిలుపు

విశాలాంధ్ర - యానాం : యానాంలో అన్ని వర్గాల పేదలకు చమురు సంస్థల నుండి నష్టపరిహారం సాధనకు అన్ని వర్గాల ప్రజల ఐక్యమత్యంతో నష్ట పరిహారం సాధించుకుంటామని యానాం కాంగ్రెస్ పార్టీ నాయకులు ములగపాటి ప్రసాద్ రాజు పిలుపునిచ్చారు. మంగళవారం మధ్యాహ్నం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎంపీ వి వైద్య లింగం సమక్షంలో యానాం పరిస్థితిలను వివరించారు. ప్రజల సంక్షేమానికి కృషి చేయవలసిన ప్రజా ప్రతినిధులు ఏళ్ల తరబడి నిర్లక్ష్యం వహించడం వలన ప్రజలు తీవ్రంగా నష్టపోయారు అన్నారు. అభివృద్ధి ఉపాధి సంక్షేమం ప్రజలకు అందడం లేదన్నారు. చమురు సంస్థల నుండి అందవలసిన నష్టపరిహారం ఒక వర్గానికి అందించడం తప్ప మిగిలిన వర్గాలకు అందించడం పూర్తి వైఫల్యం చెందారన్నారు. అలాగే రిలయన్స్ సంస్థతో కుదిరిన ఒప్పందం ప్రకారం యానాం నియోజకవర్గం లోని అన్ని గృహాలకు గ్యాస్ కనెక్షన్ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు అమలు చేసిన దాఖలాలు కనిపించడం లేదన్నారు. ఈ ఒప్పందాన్ని ప్రజా ప్రతినిధి స్వార్ధానికి ఉపయోగించుకున్నట్టు పలు రకాలుగా ప్రజల్లో అపోహలు ఉన్నాయన్నారు. ఈ ఇంటింటి గ్యాస్ కనెక్షన్ తక్షణం అమలు చేయాలని లేదంటే దీని మీద ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డి చక్రవర్తి, చీకట్ల రామకృష్ణ, కర్నిడి హరి, సత్యనారాయణ, ఒలేటి శ్రీను, పి సుబ్బరాజు మార్ల వినోద్ పాల్గొన్నారు.

అర్జీలపై నాణ్యమైన, సత్వర పరిష్కారాలను ప్రజలకు అందించాలి
జేసీ రాహుల్ మీనా

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజా విజ్ఞాపనల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) ద్వారా అందిన అర్జీలపై నాణ్యమైన, సంతృప్తికరమైన సత్వర పరిష్కారాలను ప్రజలకు అందించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా జిల్లా అధికారులను కోరారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించే అంశాలపై జిల్లా అధికారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్ఓ జె వెంకట్రావు, సిపిఓ పి త్రినాద్ అధికారులకు జిల్లాలో పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కార ప్రగతి, మరింత మెరుగైన పరిష్కార సేవలు అందించేందుకు జిల్లా అధికారులు చేపట్ట వలసిన చర్యలపై వివరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ర్యాంకింగ్ ప్రధానంగా 5పరిమితుల మీద నిర్ణయిస్తారని, ప్రజల నుండి అందిన అర్జీల సంఖ్య, నిర్దిష్ట కాలపరిధిలో పరిష్కరించిన అర్జీల సంఖ్య, అర్జీదారులకు సంతృప్తితో అందించిన నాణ్యమైన పరిష్కార సంఖ్య, ప్రజాప్రతినిధులు సూచించిన అంశాలపై పరిష్కారాలు, వాటిలో సంతృప్తి నందించిన పరిష్కారాలు అనే అంశాల ఆధారంగా జిల్లాలకు ర్యాంకింగ్ ఇస్తారన్నారు. జిల్లాలో పిజి ఆర్ఎస్ అర్జీల పరిష్కార స్థాయి 62.7శాతంగా ఉందని, దీనిని మరింత మెరుగు పరచి రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకింగ్ సాధించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అర్జీ ల పరిష్కారంలో నిర్దేశించిన విధివిధానాలను సమగ్రంగా పాటించి, చేపట్టిన చర్యల సమాచారాన్ని, అర్జీదారునికి పరిష్కారం పై వివరించి తీసుకున్న ఫోటోలను ఆన్ లైన్‌లో సక్రమంగా అప్ లోడ్ చేయాలని ఆయన ఆదేశించారు. అర్జీల పరిష్కార నాణ్యత, అర్జీదారుల సంతృప్తి సాధన, రిఓపెన్ చేసిన అర్జీలు అంశాలను జిల్లా అధికారులు ఆడిట్ చేసుకోవాలన్నారు. అర్జీల పరిష్కారాన్ని గడువు సమీపంచే వరకూ జాప్యం చేయకుండా సకాలంలో చర్యలు పూర్తి చేయాలని సూచించారు. తన క్రింది స్థాయిలోని పరిష్కార అధికారులందరికీ పిజిఆర్ఎస్ విధానం పై సమగ్రమైన అవగాహన కల్పించాలని జెసి జిల్లా అధికారులును ఆదేశించారు. అన్ని ప్రభుత్వ శాఖలలో ఉద్యోగులందరూ హౌస్ హెహోల్డ్ మాపింగ్ మాడ్యూల్‌లో తమ సమచారాన్ని వెంటనే అప్ లోడ్ చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు ఎస్ మల్లిబాబు, కె శ్రీరమణి, డివిజిఒ కె వాసుదేవ రావు, ఎస్డిసి వెంకట్రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏడిబి రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన ఎంపీ తంగెళ్ల ఉదయ్

విశాలాంధ్ర - కాకినాడ : రాజమహేంద్రవరం నుండి పెద్దాపురం, సామర్లకోట మీదుగా కాకినాడ పోర్ట్ వరకు చేపడుతున్న ఏడిబి రోడ్డు విస్తరణ పనులను మంగళ వారం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలలలోపే రహదారి విస్తరణ పనులు చేపట్టారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల నిరంతర పర్యవేక్షణతో పనులు శరవేగంగా జరుగుతున్నా యని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులను గాలికి వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రోడ్డు విస్తరణ పనులను నాణ్యతలో రాజీ లేకుండా త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులో తీసుకురావాలని ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.

కళ్యాణ మండపం నిర్మాణానికి స్థలం పరిశీలన

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : తిరుమల తిరుపతి దేవస్థానం. ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన కళ్యాణ మండపానికి కొత్తపల్లి మండలం ఉప్పాడలోని దేవాదాయ శాఖకు చెందిన స్థలాన్ని మంగళవారం కాకినాడ ఆర్డిఓ మల్లిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొత్తపల్లి గ్రామంలో దేవాదాయ శాఖకు చెందిన సుమారు ఎకరం స్థలంలో కళ్యాణ మండపం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు, తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణానికి అవసరం అయిన భూ సేకరణ ప్రతి పాదనలు జిల్లా కలెక్టర్‌కు పంపించి చర్యలు తీసుకుంటామని తెలిపి ఉన్నారు. పర్యటనలో తహసీల్దార్ చినరావు, టీటీడీ ఏఈ రవికుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మధు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను భర్త్ రఫ్ చేయాలని ఆందోళన

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : భారత రాజ్యాంగ నిర్మాత పరమ పూజ్యులైన బాబాసాహెబ్ అంబేద్కర్‌ను పార్లమెంటులో అవమానకరంగా కించపరిచిన కేంద్రమంత్రి అమిత్ షా ను హోంమంత్రి పదవి నుంచి బర్త్ ఆఫ్ చేయాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. బహుజన సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి పిలుపుమేరకు దేశంలోని అన్ని అంబేద్కర్ విగ్రహాల వద్ద ఆందోళన నిర్వహించాలని ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.ఎస్.పి. స్టేట్ కోర్డినేటర్ చిత్రసేను మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో ఉన్నతమైన రాజ్యాంగంగా కొనియాడబడుతున్న భారత రాజ్యాంగా అవమానకరంగా మాట్లాడిన కేంద్రహోం శాఖ మంత్రి అమిత్ షా పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బి.ఎస్.పి. తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పట్నాల విజయ కుమార్ మాట్లాడుతూ.భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌ని కించపరిచిన అమిత్ షా మంత్రి పదవి నుండి తప్పుకోవాలని లేదా భారత రాష్ట్రపతి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది పడమట గణేశ్వరరావు, ఇసుకపట్ల రాంబాబు,నల్లి రమేష్, కొండపల్లి. సూరిబాబు,రాజేష్ వెంకటరత్నం, గూడా సూర్య సందీప్ , ఇలరు. రమేష్, ఏ. విజయకుమార్, బద్దాజాన్, మర్రి, మగల క్ష్ముడు, డెల్లా. జాషువా, కేతపల్లి శేఖర్. నెల్లి. సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణి

విశాలాంధ్ర - అమలాపురం : స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజినల్ ఆఫీస్ అమలాపురం వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ క్రింద అమలాపురం, కొంకాపల్లి, కందికుప్ప, రాజోలు లోని వివిధ స్కూళ్లలోని పది మంది పేదవిద్యార్థినులుకు సైకిళ్ళు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమలాపురం స్టేట్ బ్యాంకు రీజినల్ మేనేజర్ ఎమ్ వంశి కృష్ణ మాట్లాడుతూ విద్య అనేది ప్రజల జీవితాలను, సమాజాన్ని మెరుగుపరచడంలో సహాయపడే ప్రాథమిక హక్కు అందునా బాలికలకు సాధికారత కల్పించడంలో, సామాజిక అడ్డంకులను ఛేదించడంలో, కుటుంబాలు, దేశానికి మంచి భవిష్యత్తును అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. విద్యను ప్రోత్సహించటానికి మా వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో స్కూళ్ల హెడ్ మాస్టర్లు నాగేం ద్రరావు, కామేశ్వరరావు, సత్యనారాయణ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో నూతన శాఖను తెరవనున్న యుటిఐ మ్యూచువల్ ఫండ్

విశాలాంధ్ర – కాకినాడ : భారతదేశంలోని ప్రముఖ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థల్లో ఒకటైన యుటిఐ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (యుటిఐ ఏఎంసి), ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో షాప్ నెం./డి నం 25-6-37, గ్రౌండ్ ఫ్లోర్, గంజాం వారి వీధి వద్ద యుఎఫ్‌సి తమ నూతన శాఖను ప్రారంభించనున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. 26 డిసెంబర్ 2024న దక్షిణ, తూర్పు ఉత్తర భారత దేశం అంతటా 16 కొత్త యుటిఐ ఫైనాన్షియల్ సెంటర్‌లను (శాఖలు) ప్రారంభిస్తున్నట్లు కంపెనీ ప్రకటించిందన్నారు. ఆర్థిక చేరికను ప్రోత్సహించడానికి మ్యూచువల్ ఫండ్ పెట్టుబడుల ద్వారా ప్రధాన స్రవంతి ఆర్థిక పర్యావరణ వ్యవస్థలోకి బి 30 నగరాల నుండి పెట్టుబడదారులను తీసుకురావడానికి దేశవ్యాప్తంగా తమ పరిధిని విస్తరించాలని యుటిఐ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇమ్త్రేయాజుర్ రెహమాన్, ఎండి మరియు సీఈఓ మాట్లాడుతూ, "మేము వ్యూహాత్మకంగా యుటిఐ ఫైనాన్షియల్ సెంటర్‌లను ప్రారంభిస్తున్నామన్నారు. మా ఆఫరింగ్‌ల పూర్తి శ్రేణిని వినియోగదారులకు అందుబాటులో ఉండేలా చూస్తామని అన్నారు. కొద్దికాలంగా మ్యూచువల్ ఫండ్ పెట్టుబడు లలో వ్యక్తిగత పెట్టుబడిదారుల భాగస్వామ్యంలో పెరుగుదల, ముఖ్యం గా బి 30 నగరాల్లో, మా విస్తరణ చాలా ప్రోత్సాహకరంగా ఉంద"న్నారు. ఆర్థిక సేవలను సులభతరం చేయడం, అవగాహన కల్పించడం మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను అందరికీ అందుబాటులో ఉంచడం వంటి దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణముగా ఇవి ఉంటాయి" అని అన్నారు.

కార్మికుల సంక్షేమం ముఖ్యం

విశాలాంధ్ర – రాజమహేంద్రవరం : రాజమండ్రీ పేపరు మిల్లు కార్మికుల వేతన సవరణ విషయం లో కంపెనీ యాజమాన్యం ఉద్దేశ్య పూర్వకంగానే కాలయాపన చేయడం తగదని, ఈ విషయంలో తక్షణ కర్తవ్యంగా ఇరు వర్గాలకు ఆమోదయోగ్యమైన ప్రకటన విడుదల చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి, శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామ కృష్ణ లు స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో కార్మిక శాఖ జాయింట్ లేబర్ కమిషనర్ అధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పేపరు మిల్లు యాజమాన్యం, కార్మికులతో 2020, 2023 వేతన సవరణ విషయం పై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, నాలుగు నెలలు క్రితం నిర్వహించిన సమావేశంలో ఆమోదయోగ్యమైన పరిష్కారం లభించే విధంగా వేతన సవరణ చేస్తామని పేపరు మిల్లు యాజమాన్యం హామీ ఇచ్చారని అన్నారు. నేటి సమావేశం మేరకు నిర్ణయం ప్రకటించడం ద్వారా చివరి సమావేశం కావాలని ఆకాంక్షించా మన్నారు. అయితే ఈ విషయములో మిల్లు యాజమాన్యం మొండి వైఖరీ ఆమోదయోగ్యం కాదన్నారు. పేపరు మిల్లు యాజమాన్యం అటు కార్మీకుల సంక్షేమాన్ని పరిరక్షించడం లేదని, అదే సమయంలో నగర పాలక సంస్థ కు, నగర అభివృద్ధి కి పెద్దగా వెచ్చించిన దాఖలాలు లేవన్నారు. గత సమావేశంలో రూ.3250 వేతన పెంపునకు అంగీకారం తెలిపినా, ఇప్పుడు సమావేశంలో 3500 లకే పరిమితం అవ్వడం పై కార్మికులు అసంతృప్తిగా ఉన్నట్లు పేర్కొన్నారు. యాజమాన్యం వేతన సవరణ విషయంలో యాజమాన్యం అనుకూలంగా ఉందన్న సమాచారం ఉందన్నారు. ఇరు పక్షాలకు ఆమోద్య మైన పరిష్కారం దిశగా అడుగులు వేయడం ముఖ్యం అన్నారు.ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, పేపరు మిల్లు యాజమాన్యం, పేపరు మిల్లు కార్మికుల తో నిర్వహించిన సమావేశం చక్కటి వేతన సవరణ పరిష్కారం లభించక పోవడం పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తామని పేర్కొన్నారు.ఈ సమావేశంలో రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ, శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామ కృష్ణ , జాయింట్ కమిషనర్ (లేబర్) ఏ. రాణి, సహాయ కార్మిక అధికారి ఎస్కే జాబీనా, డిఎస్పీ ఏ కే సుబ్బరాజు, పేపర్ మిల్లు అసోసియేట్ డైరెక్టర్ అక్కినేని జయ కృష్ణ, యాజమాన్య ప్రతినిధులు మేనేజర్ బాగ్లే, బిజాయి కుమార్ సంకు, హెచ్ ఆర్ గణేష్, ఫైనాన్స్ హెడ్ రిషికాంత్ గుప్తా, సి ఎస్ ఆర్ మేనేజర్ డీ. తాతరావు, కార్మిక సంఘం ప్రతినిధులు సిఐటియూ ఎస్. వేంకటేశ్వర రావు, అరుణ్, ఎ ఐ టి యు సి ఏ. సత్యనారాయణ, ఐ ఎన్ టీ యూ సి జె వై దాసు స్టాఫ్ వర్కర్ సంఘం కే. రాజేష్, బీ. మురళీ కృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ వార్షికోత్సవం

విశాలాంధ్ర – అమలాపురం : ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 72 ఆవిర్భావ దినోత్సవం జిల్లా కేంద్రం అమలాపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నందు ఏపి మెడికల్ కౌన్సిల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా విభాగం ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జాయింట్ సెక్రటరీ వసంత అధ్యక్షతన అమలాపురంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ తిరుమల, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అమలాపురం డివిజన్ గౌరవాధ్యక్షురాలు హెడ్ నర్సు శర్వాణి ఎఐటియూసీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు , ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సత్తిబాబు ముఖ్య అతిథులు గా విచ్చేసారు. 72వ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమానికి హాజరైన ఉద్యోగులు కార్మికులు, నాయకులు హర్ష ధ్వానాలు నడుమ ఎపి ఎం ఈయు ఉపాధ్యక్షురాలు సత్య వతి 72వ ఆవి ర్భావ దినోత్సవం సెలబ్రేషన్ కేక్ కటింగ్ చేసారు. అనంతరం సత్తిబాబు మాట్లా డుతూ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజలకు మంచి సేవలు అందించే వైద్య ఆరోగ్య శాఖలో డాక్టర్లు, స్టాఫ్ నర్స్, సిస్టర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్ ఇతర సిబ్బంది అందరూ కూడా కోవిడ్ టైమ్‌లో తమ ప్రాణాలను పాపంగా పెట్టి ప్రేమన పమంచి సేవలు అందించి ప్రభుత్వం వైద్య విధానం పరిషత్ అగ్రగామిగా నిలి చింది అన్నారు. ఆ సంస్థ యాజమాన్యం ఆదాయం కోసం కాకుండా కోనసీమ ప్రజలకు సేవలు అందించాలని సదుద్దేశంతో కోవిడ్ టైంలో కోనసీమ జిల్లా ప్రజలకు ఉపయోగపడిందని సత్తిబాబు తమ సందేశంలో ఆ సంస్థను కూడా ప్రశంసించారు. 72 సంవత్సరాల సుదీర్ఘకాలం ప్రభుత్వ రంగ వైద్య సేవలు అందించడంలో నిరంతరం దృష్టి సారించే అధికారులు సిబ్బంది ప్రయోజనాల కోసం పనిచేసింది. అన్ని కేటగిరీల ఉద్యోగుల ప్రయోజ నాలను కాపాడుతూ ప్రజలకు వైద్య సేవలు అందించే లక్ష్యాలు వైపుకి పునరంకితం అవుతూ మరో వసంతం ముందుకు సాగాలని తిరిగి 73 ఆవిర్భావ దినోత్సవం పాల్గొందామని తెలియజేశారు. అదేవిధంగా అనేక సంఘాలకు మాతృకైన ఎర్రజెండా ఈ దేశంలో పుట్టి 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని డిసెంబర్ 26 నాడు వందవ సంవత్సరంలో అడుగుతుందని ఎర్రజెండా పుట్టినరోజు కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా జరుగుతాయని 30వ తేదీన ఎర్రజెండా ఆవిర్భావ దినోత్సవం ముగింపు సభ అమలాపురంలో నిర్వహించాలని నిర్వాహకులు భావిస్తున్నారు. మెడికల్ ఎంప్లాయిస్ వారు కూడా హాజరు కావాలని కోరారు.

హేలాపురి అభివృద్ధికి ప్రణాళిక : మేయర్

-15వ ఆర్థిక సంఘ నిధులతో 680 గుంతలు పూడ్చివేత
-డిప్యూటీ సీఎం పవన్ ఫోటో లేకపోవడంపై అభ్యంతరం
-సాదాసీదాగా సాగిన కౌన్సిల్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : హేలాపురి నగరాభివృద్ధికి ప్రజా ప్రతినిధుల సహకారంతో ఒక ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతామని నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగానే ఎజెండాలో అంశాలు పొందుపరిచినట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం నుండి విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3.84 కోట్లతో నగరంలోని అంతర్గత రోడ్లు నిర్మాణం, ప్రధాన రోడ్లు మరమ్మతులు పూర్తి చేసి ప్రజలకు సురక్షిత ప్రయాణానికి మార్గం సుగమం చేసామన్నారు. మంగళవారం ఏలూరులోని నగరపాలక సంస్థ కార్యాలయంలోని సర్వసభ్య సమావేశ మందిరంలో మేయర్ అధ్యక్షతన పాలకవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్వల్ప వాదోపవాదనలు మినహా సమావేశం సాదాసీదాగా కొనసాగింది. నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫోటో పెట్టకపోవడాన్ని కూటమి నేతలు అభ్యంతర వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుండి సర్క్యూలర్ ఉన్నప్పటికీ డిప్యూటీ సీఎం ఫోటో పెట్టకపోవడం పట్ల అధికారు లను నిలదీసి, వెంటనే డిప్యూటీ సీఎం ఫోటో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 19 అంశాలతో కూడిన అజెండాను పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. జూలై నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశం లో ఏలూరు నగరంలో కాపు సామాజిక వర్గానికి 2313 గజాల స్థలాన్ని కేటా యిస్తూ కౌన్సిల్లో చేసిన తీర్మానంపై స్థల యజమానులు హైకో ర్టును ఆశ్ర యించినట్టు తెలిపారు. దీంతో సర్వోన్నత న్యాయ స్థానం ఉత్తర్వుల మేరకు కౌన్సిల్ తీర్మానం ఉపసంహరించుకోవాలని ఆదేశించిన నేపథ్యంలో త్వరలోనే కాపులకు కళ్యాణ మండపం నిర్మించుకునేందుకు అనువైన స్థలం కేటాయిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ఏలూరు నగరాన్ని అభివృద్ధి చేయడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసినట్టు చెప్పారు. ఇందుకు సంబంధించి అవసరమైన నిధులు సమకూర్చుకు నేందుకు ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదించనున్నట్లు స్పష్టం చేశారు. పార్టీలకతీతంగా ఏలూరు నగరంలో 50 డివిజన్లను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. 2022-23 సంవత్సరానికి 2వ విడతగా విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులు 3 కోట్ల 69 లక్షలు రూపాయలతో నిబంధనలకు అనుగుణంగా కేటా యించిన 87పనులను ఆమోదించామన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి మొదటి విడతగా వచ్చిన నిధులు 3 కోట్ల 84 లక్షల రూపా యలతో 10 పనులను ఆమోదించినట్లు వివరిం చారు. నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ సిబ్బంది మృతి చెందితే వారి అంత్యక్రియలు నిమిత్తం రూ.15 వేలు చెల్లించడానికి అంగీకరించినట్లు చెప్పారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఆదేశాలతో నగరంలో సుమారు 680 గుంటలను గుర్తించి రూ.1 కోటి 25 లక్షలు రూపాయలు నిధులు కేటాయించి సంక్రాంతి లోపు గుంతలు లేని నగరంగా తీర్చి దిద్దడానికి కృషి చేస్తున్నట్లు మేయర్ నూర్జహాన్ చెప్పారు. ఏలూరు నగరాన్ని కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి బాటలో నడిపించేందుకు పాలకవర్గ సభ్యులందరూ సమిష్టిగా ఐకతాటిపై నిలిచి ముందుకు సాగాలని మేయర్ నూర్జహాన్ పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో కమిషనర్ భాను ప్రతాప్, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, చోడే వెంకటరత్నం, కొల్లేపల్లి రాజు, జాలా సుమతీ, నీతా విజయ్ జైన్, కార్పొరేటర్లు, అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య, డీసీ శివా రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్, కార్పొరేషన్ ఎస్ఈ, ఈఈ, కార్పొరేషన్ మేనేజర్, ప్రాజెక్ట్ ఆఫీసర్, ఇంజనీరింగ్ విభాగం డిఇలు, ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర సహకార సంస్థ నిర్ణయాలతో సంఘాలను బలోపేతం చేయాలి

విశాలాంధ్ర – ఏలేశ్వరం : సహకార సంఘం ఆవరణలో జరి గిన సహకార రంగంలో పని చేస్తున్న సిబ్బందికి అవగాహన సదస్సు లో ముఖ్య అతిథిగా ఉభయ తెలుగు రాష్ట్రాల సంయుక్త సమన్వ యకర్త డాక్టర్ ఎస్ఎల్ఎన్ టి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర సహకార మంత్రిత్వ శాఖలో తీసు కున్న నిర్ణయాల్లో భాగంగా రాష్ట్రాల పరిధిలో సహకార సం ఘాలు సహకార రంగ విస్తరణలో భాగంగా సంఘములు బలోపేతం కావడానికి వనరుల్లో సమీకరణకు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో తీసు కోవలసిన జాగ్రత్తలను సంఘముల నిర్వాహణలో ఆర్థిక క్రమశిక్షణ కంప్యూటరైజేషన్ వంటి ఒక లక్ష మూడువేల నూతన మల్టీపర్పస్ ప్రాథ మిక పరపతి సహకార సంఘాలు ఒక లక్ష 6 వేల పాల ఉత్పత్తిదారుల సంఘాలు స్పెషరీస్ 11వేల ఫిషరీస్ సహకార సంఘాలు రానున్న ఐదు సంవత్సరాల కాలంలో నాబార్డు ద్వారా ఏర్పాటు కానున్నవని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. అంతేకాక సహకార సంఘాలపై పలు అంశములను సంఘ సభ్యులకు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిసిసిబి మేనేజర్ రవికుమార్ సూపర్వైజర్ నాగేంద్ర ఏలేశ్వరం కో-ఆపరేటివ్ సొసైటీ సీఈవో జ్యోతుల నాగ సత్య శ్రీనివాస్ సంఘ రైతు సభ్యులు బంటుపల్లి సత్యనారాయణ గుణాపు అప్పలరాజు గంధం కాశి సంఘ సిబ్బంది పాల్గొన్నారు.